క్లుప్తంగా

ఈ-క్రాప్ నమోదు వేగవంతం చేయాలి



సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమీక్ష నిర్వహిస్తున్న జెడ్పీటీసీ అప్పలనాయుడు

గుర్ల: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ–క్రాప్ నమోదును వేగవంతం చేయాలని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మండలం లోని నడుపూరు గ్రామ సచివాలయంలో సిబ్బందితో పలు అంశాలపై సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. సచివాలయం పరిధిలో అభివృద్ధి పనుల పురోగతిపై చర్చిం చారు.అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత వలంటీర్లేదనని అన్నారు. వరి నాట్లు పూర్తికావడంతో ఎరువులు, పురుగు మందులను రైతు భరోసా కేంద్రంలో అందుబాటులో ఉంచాలన్నారు. నడుపూరు సర్పంచ్ తాతమ్మ పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన



కేజీబీవీలో పనులను పరిశీలిస్తున్న డీఈ హరిప్రసాద్

లక్కవరపుకోట: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో చేపడుతున్న నాడు–నేడు పనులను సర్వశిక్ష అభియాన్ డీఈ ఎస్.హరిప్రసాద్ సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో నాడు– నేడు రెండో విడతలో ఆరు పాఠశాలల్లో పనులు చేపడుతున్నామని చెప్పారు. వీటిలో అయిదు పాఠశాలల్లో అదనపు తరగతి గదులను నిర్మిస్తున్నట్లు తెలిపారు. అలాగే 13 అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్తి స్థాయిలో మరమ్మతులు, మరో మూడు కేంద్రాల్లో పాక్షికంగా మరమ్మతులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈపనులకు రూ.4.5 కోట్లు మంజూరు చేసిందని, ఇప్పటి వరకు సుమారు రూ.2 కోట్లు వరకు బిల్లులు చెల్లించినట్లు తెలిపారు. ఆయన వెంట జేఈ రామచంద్రరావు తదితరులు ఉన్నారు.

రూ.9.78 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణం



భూమిపూజ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మెరకముడిదాం: మండలంలోని చినరవ్వాం గ్రామంలో రూ.9.78 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ నాయకుడు పల్లికృష్ణ సోమవారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వీధుల్లో సీసీ రోడ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. గ్రామంలో గతంలో పనులు ప్రారంభించి అర్థంతరంగా విడిచిపెట్టేసిన అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు ప్రభుత్వం రూ.9.60 లక్షలు మంజూరు చేసిందని తెలిపారు. స్థానిక నాయకులు అన్నంనాయుడు, సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు, నిర్వాహకులు

దత్తిరాజేరు: మండలంలోని మరడాం గ్రామంలో భారతమ్మ పేరంటాలమ్మ గుడి వార్షికోత్సవం సందర్భంగా నిర్వాహకులు గుగ్గిలపు సంజీవరావు ఆధ్వర్యంలో సోమవారం 500 మందికి దుస్తులు పంపిణీ చేశారు. గుడికి సంబంధించిన వారి బంధువు, కాశీబుగ్గ సీఐ జి.శ్రీనివాసరావు ఈ దుస్తులు సమకూర్చారు. 300 మంది మహిళలకు చీరలు, 200 మంది పురుషులకు కండువాలను ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు చేతుల మీదుగా అందజేశారు.అనంతరం అన్నదానం చేశారు. గ్రామ పెద్దలు ఆలుమూరి నారాయణరావు, మచ్చిట్టి ఆదినారాయణ, కర్రి అప్పలనాయుడు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'స్పందన'

గజపతినగరం: ప్రజాసమస్యల పరిష్కారానికే ప్రతీ సోమవారం మండలపరిషత్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ కిశోర్‌కుమార్ తెలిపారు. అన్నిశాఖల అధికారులతో కలిసి ఎంపీడీఓ కార్యాలయంలో 'స్పందన' నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం అధికారులతో ఎంపీడీఓ సమావేశమై గ్రామాల్లో సమస్యలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు. 'జగనన్నకు చెబుదాం' హెల్ప్ లైన్‌కు అందే ఫిర్యాదులతో పాటు స్పందనలో అందే అర్జీలకు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తక్షణ పరిష్కారం చూపాలని అన్నారు.

పేదింటి పిల్లలకు పెద్ద చదువులు

- ఉన్నత చదువులకు ప్రభుత్వం ఊతం
- జగనన్న విద్యాదీవెనతో పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్
- వసతి దీవెన పేరిట భోజనం, వసతికి ఆర్థిక సహాయం
- ప్రతీ త్రైమాసికానికి ఫీజులు విడుదల



శృంగవరపుకోట/బొండపల్లి/చీపురుపల్లి: చదువుతోనే పేదరికాన్ని జయించవచ్చని, పిల్లలకు మనం ఇచ్చే అతిపెద్ద ఆస్తి చదువేనని నమ్మిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేదింటి పిల్లలు ఉన్నత చదువులు చదవాలన్న లక్ష్యంతోనే జగనన్న విద్యా దీవెన, వసతిదీవెన పథకాలను అమలు చేస్తున్నారు. జిల్లాలో అధిక శాతం వ్యవసాయం ఆధారంగా జీవించేవారే. పిల్లలను పెద్ద చదువులు చదివించే ఆర్థిక స్థోమత చాలా మందికి లేదు. అప్పులు చేసి కొంతమంది పిల్లలను చదివిస్తే...కొంత మంది పాఠశాల చదువులు పూర్తికాగానే పిల్లలను చదువు మాన్పించేసి ఏదో ఒక పనిలో పెట్టేసేవారు. అయితే నేడు ఈ పరిస్థితులు మారాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలతో పేదింటి పిల్లలు కార్పొరేట్ విద్యాలయాల్లో ఉన్నత చదువులు చదువుకుంటున్నారు. డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్, ఐటీఐ, పాలిటెక్నిక్ తదితర కోర్సులు చేస్తున్న విద్యార్థులకు ఏటా నాలుగు దఫాలుగా ఫీజులను, రెండు దఫాలుగా ప్రభుత్వం వసతి, భోజన ఖర్చులను ప్రభుత్వం జమచేస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ త్రైమాసికానికి విద్యాదీవెన నిధులను ప్రభుత్వం విద్యార్థుల తల్లుల ఖాతాల్లో సోమవారం జమచేసింది.ఎస్.కోట నియోజకవర్గంలోని 5,757 మంది విద్యార్థులకు రూ.3,86,55,325, చీపురుపల్లి నియోజకవర్గంలోని 5,567 మందికి రూ.3,42,22,155, గజపతినగరం నియోజకవర్గంలో 6,952 మందికి రూ.4,42,73,324 ప్రభుత్వం విడుదల చేసింది. వసతి దీవెనలో భాగంగా భోజన, వసతి ఖర్చులకు ఐటీఐ విద్యార్థులకు రూ.10వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15వేలు, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసన్ వంటి కోర్సులు చదువుతున్న వారికి రూ.20 వేలు చొప్పున ప్రభుత్వం అందజేస్తోంది. నియోజకవర్గానికి ఏటా విద్యాదీవెన, వసతి దీవెన పథకాలకు సరాసరి రూ.20 కోట్లకు పైగానే నిధులను ప్రభుత్వం ఖర్చు చేస్తోంది.

చదువుతోనే తలరాతలు మారుతాయి..



ఒక్క చదువుతోనే పేదల తలరాతలు మారుతాయన్నది సీఎం జగన్ మోహన్‌రెడ్డి నమ్మకం. పేదోళ్ల పిల్లలు కూడా ఉన్నత చదువులు చదువుకోవాలనే ఉద్దేశంతో వేల కోట్ల రూపాయలను విద్యకోసం ఖర్చు చేస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో నేడు సామాన్యుల పిల్లల కూడా ఇంజినీరింగ్, మెడిసిన్ వంటి ఉన్నత చదువులు చదువుతున్నారు. ఎస్.కోట నియోజకవర్గంలో ఏడాదికి రూ.20.99 కోట్లు విద్యాదీవెన, వసతి దీవెన పథకాలకు ప్రభుత్వం ఖర్చు చేస్తోంది.

– కె.శ్రీనివాసరావు, ఎమ్మెల్యే, ఎస్.కోట.

క్రమం తప్పకుండా ఫీజు చెల్లిస్తున్నారు..



గజపతినగరంలోని ప్రతిభ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్నాను. కళాశాలకు చెల్లించాల్సిన ఫీజులను ప్రభుత్వం విద్యా దీవెన పథకం కింద మా అమ్మ ఖాతాలో మూడేళ్లూ క్రమం తప్పకుండా జమచేసింది. ప్రభుత్వ ప్రోత్సాహంతో చదువుకోగలుగుతున్నాం.

– పతివాడ హర్షిత, ఎస్.చింతలవలస గ్రామం, దత్తిరాజేరు మండలం.

మూడేళ్లుగా విద్యాదీవెన అందుకుంటున్నా..



సీఎం జగన్ పేదల విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. జగనన్న విద్యాదీవెన వస్తుందన్న భరోసాతోనే ఇంజినీరింగ్‌లో జాయిన్ అయ్యాను. మూడేళ్లుగా విద్యాదీవెన వస్తోంది. ప్రస్తుతం ఎన్ఎస్ఆర్ఐటీలో సీఎస్ఈలో డేటా సైన్స్ చదువుతున్నాను.

– కె.వాహిని సాయిశరణ్య, బీటెక్, ఎస్.కోట.

విద్యా దీవెనతో భరోసా



జగనన్న విద్యాదీవెన నా ఇంజినీరింగ్ చదువుకు భరోసా కల్పించింది. మాది వ్యవసాయ కుటుంబం. ఇంజినీరింగ్ చదువుకునేందుకు మా ఆర్థిక పరిస్థితి సరిపోదు. ప్రభుత్వం విద్యాదీవెన, వసతి దీవెన పథకాలతో ఫీజులు, వసతి, భోజన ఖర్చులు చెల్లిస్తుండడంతో గుంటూరులోని ఆర్.వి.ఆర్ అండ్ జేసీ కళాశాలలో బీటెక్ చదువుకోగలుగుతున్నాం. ప్రస్తుతం బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నారు. విద్యాదీవెన ద్వారా సుమారు రూ.50వేలు వరకు అందింది.

– దరిమిరెడ్డి కిరణ్‌కుమార్, బీటెక్, జన్నివలస గ్రామం, జామి మండలం

డీపట్టా భూములను సర్వే చేయండి



వీఆర్‌ఓలకు సూచనలు చేస్తున్న తహసీల్దార్ ఆదిబాబు

లక్కవరపుకోట: గ్రామాల్లో 2003 సంవత్సరం ముందు ప్రభుత్వం అందించిన డీపట్టా భూములపై సర్వే నిర్వ హించాలని తహసీల్దార్ ఆదిబాబు వీఆర్‌ఓలను ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓలతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2003 ఏడాది ముందు ప్రభుత్వం అందించిన డీపట్టా భూములకు సంబంధించి ప్రస్తుత స్థితి, సాగుదారుల వివరాలను పరిశీలించి ప్రభుత్వ సూచించిన ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలన్నారు. అలాగే ఈనెల 21వ తేదీ వరకు నిర్వహించిన ప్రత్యేక ఓటరు సర్వేలో కొత్త ఓటర్ల నమోదు,పేర్ల మార్పు, తొలగింపులకు సంబంధించి అందిన దరఖాస్తులను త్వరగా ఆన్‌లైన్ చేయాలని సూచించారు. మండల సర్వేయర్ గ్రంది రామం, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మద్యం దుకాణాల్లో తనిఖీలు



దేవుపల్లి దుకాణంలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ ఎస్ఐ

బొండపల్లి: మండలంలోని దేవుపల్లి, బొండపల్లిలోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఎక్సైజ్ డిపో ఎస్ఐ ఎస్.నర్సింహులు, విజిలెన్స్ ఎస్ఐ డి.గంగాధర్ సోమవారం తనిఖీలు నిర్వహించారు. దేవుపల్లిలోని దుకాణం వల్ల ఇబ్బందులు పడుతున్నామని చుట్టు పక్కల దుకాణాలు వారు జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో ఫిర్యాదు చేయడంతో దుకాణాలను పరిశీలిస్తున్నామని వారు తెలిపారు. దేవుపల్లిలోని దుకాణానికి ప్రహరీ నిర్మించాలని సంబంధిత భవన యజమానికి సూచించామని తెలిపారు. దుకాణాల్లో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు.

విద్యుత్ ఉద్యమకారుల త్యాగం వెలకట్టలేనిది



అమరవీరులకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కొత్తవలస: విద్యుత్ చార్జీలు తగ్గించాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2000 సంవత్సరం ఆగస్టు 28న హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో ధర్నా చేస్తున్న ఉద్యమకారులపై అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రభుత్వం కాల్పులు జరిపి ముగ్గురిని పొట్టన పెట్టుకుందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు గాడి అప్పారావు గుర్తు చేశారు. నాటి ఉద్యమంలో అమరులైన వారికి మండల కేంద్రంలో సీపీఎం నాయకులు సోమవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ శాంతియుతంగా ధర్నా చేస్తున్న వారిపై అప్పటి చంద్రబాబు ప్రభుత్వం విచక్షణ రహితంగా కాల్పులు జరిపిందన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మహేష్, బి.రమణ, ఎస్ఎఫ్ఐ నాయకులు హర్ష,నాయుడుపాల్గొన్నారు.

వేతనాలు ఖాతాల్లో జమచేయాలని వినతి



బొండపల్లిలో ఏపీఎంకు వినతిపత్రం అందజేస్తున్న వీఓఏలు



దత్తిరాజేరులో ఏపీఎంకు వినతిపత్రం అందజేస్తున్నవీఓఏలు

బొండపల్లి/ దత్తిరాజేరు: తమకు వేతనాలను నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని, సమస్యలు పరిష్కరించాలని బొండపల్లి, దత్తిరాజేరు మండలాల వీఓఏలు కోరారు. ఆయా మండల కేంద్రాల్లోని వెలుగు కార్యాలయాల్లో ఏపీఎంలు కె.సులోచనాదేవి, అచ్యుతరావుకు సోమవారం వారు వినతిపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రూ.10 లక్షల జీవిత బీమా వర్తింపచేయాలని కోరారు. వీఓఏలు ఎం.వరలక్ష్మి, సీహెచ్.నాగమణి, జి.సూర్య భవాని, బి.శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

విజయనగరం ఫోర్ట్: రక్తదానం ప్రాణదానంతో సమానమని గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్ అన్నారు. సోమవారం స్థానిక రోటరీ బ్లడ్ బ్యాంక్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మనిషి మాత్రమే రక్తదానం చేసి ఆపదలో ఉన్న సాటి మనిషి ప్రాణాలు కాపాడగలడన్నారు. ఆరోగ్యవంతులు రక్తదానం చేయాలన్నారు.

అతిథి అధ్యాపకులకు ఆహ్వానం

చీపురుపల్లిరూరల్: చీపురుపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి ఇంగ్లిష్, కంప్యూటర్ అప్లికేషన్స్, కంప్యూటర్ సైన్స్, పొలిటికల్ సైన్స్ గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి.కృష్ణాజీ సోమవారం తెలిపారు. ఆయా సబ్జెక్టులలో పీజీలో 55 శాతం మార్కులు సాధించిన వారు అర్హులని చెప్పారు. ఆసక్తి గల వారు వచ్చే నెల 8వ తేదీలోపు దరఖాస్తులను కళాశాలలో అందజేయాలని సూచించారు.

పాఠశాల సందర్శన



విద్యార్థుల వర్క్‌బుక్స్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: మండలంలోని జగ్గయ్యపేట ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ బాలభాస్కరరావు సోమవారం సందర్శించారు. లెసెన్ ప్లాన్స్, విద్యార్థుల వర్క్‌బుక్స్, హాజరు రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఆయన వెంట సీఆర్పీ రామ్‌ప్రసాద్ ఉన్నారు.

నేడు తలారిలో మెగా వైద్యశిబిరం

లక్కవరపుకోట: మండలంలోని తలారి గ్రామంలో పాల్ మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నామని ఆ సంస్థ చైర్మన్ డి.డానియల్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నానికి చెందిన మెడీకవర్ ఆస్పత్రి వారి సౌజన్యంతో ఈ శిబిరం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరంలో వైద్యసేవలందిస్తారని, ప్రజలు సద్వినియోగించుకోవాలని సూచించారు.

విత్తనోత్పత్తిపై అవగాహన



కొత్తపాలెంలో అవగాహన కల్పిస్తున్న ఏఓ సంగీత

బొండపల్లి: ప్రతీ రైతు తమకు కావాల్సిన విత్తనాలను సొంతంగా తయారు చేసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం ఏఓ కె.సంగీత సూచించారు. మండలంలోని వెదురువాడ, కొత్తపాలెం, ఎం.కొత్తవలస గ్రామాల రైతు భరోసా కేంద్రాల్లో గ్రామీణ విత్తనోత్పత్తి పథకంపై రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు తాము సాగు చేస్తున్న పంట నుంచే మేలైన విత్తనాలను సేకరించుకోవాలని, ఈ విధానం వల్ల విత్తనాలకు కొరత ఉండదని అన్నారు. ఏఓ పి.వి.మల్లికార్జునరావు, ఎం.కొత్తవలస సర్పంచ్ కర్రోతు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పాడిపరిశ్రమ అభివృద్ధికి కృషిచేయండి



గోపాలమిత్రలు,ఏహెచ్‌ఏలతో సమీక్ష నిర్వహిస్తున్న ఏడీ చలపతిరావు

వేపాడ: పాడిపరిశ్రమ అభివృద్ధికి గోపాలమిత్రలు, ఏహెచ్ఏలు తమ వంతు కృషి చేయాలని, పశువుల కృత్రిమ గర్భధారణ లక్ష్యాలను పూర్తి చేయాలని ఎస్.కోట ఏరియా పశువైద్యాశాల అసిస్టెంట్ డైరెక్టర్ బి.చలపతిరావు సూచించారు. స్థానిక పశు వైద్యకేంద్రంలో సోమ వారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాడిపరిశ్రమను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై పాడిరైతులకు అవగాహన కల్పించాలని కోరారు. రైతు భరోసాకేంద్రాల్లో పశువులకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయని, వ్యాధుల బారిన పడిన పశువులకు సకాలంలో వైద్యసేవలందించాలని సూచించారు. వేపాడ పశువైద్యాధికారి సింహాచలం నాయుడు పాల్గొన్నారు.

కరాటేలో రాణించిన విద్యార్థులకు అభినందన



చీపురుపల్లి రూరల్: బంగారు పతకం సాధించిన బాలాదిత్యను సత్కరిస్తున్న జెడ్పీటీసీ శ్రీనివాసునాయుడు



కొత్తవలస: విద్యార్థి లక్ష్మీదీపక్‌ను అభినందిస్తున్న వాగ్దేవి కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్

చీపురుపల్లి రూరల్: అంతర్ జిల్లాల కరాటే పోటీల్లో బంగారు పతకం సాధించిన చీపురుపల్లికి చెందిన పరదేసి బాలాదిత్యను జెడ్పీటీసీ వలిరెడ్డి శ్రీనివాసునాయుడు తన కార్యాలయంలో సోమ వారం ఘనంగా సత్కరించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించే విద్యార్థులకు ఉన్నత భవిష్యత్ ఉంటుందన్నారు. కోచ్‌లు శివ, శేఖర్‌ను అభినందించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం.శ్రీనివాసరావు, సీతారాం, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదీపక్‌కు బ్రాంజ్ మెడల్

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి గ్రామ సమీపంలోని వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థి కె.లక్ష్మీదీపక్ ఈ నెల 27వ తేదీన విశాఖపట్నంలో నిర్వహించిన అంతర్ జిల్లాల కరాటే పోటీల్లో జూనియర్ విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించాడు. విద్యార్థిని కళాశాల కరస్పాండెంట్ కె.మహేశ్వర రావు, ప్రిన్సిపాల్ ఎస్.ఈ.కుమార్‌బాబు కళాశాలలో సోమవారం అభినందించారు.

• రోడ్డు బాగుచేయాలి



కృష్ణాపురంలో వాటర్‌వర్క్స్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

శృంగవరపుకోట: తాటిపూడి రిజర్వాయర్ నీటిని విశాఖకు తరలించే పైపులైన్ నిర్వహణ కోసం పొలాలు మీదుగా జీవీఎంసీ అధికారులు గతంలో వేసిన రోడ్డు పూర్తిగా పాడైందని, రోడ్డును జీవీఎంసీ వారు బాగుచేయాలని రైతులు డిమాండ్ చేశారు. మండలంలోని కృష్ణాపురం గ్రామంలోని తాటిపూడి వాటర్‌వర్క్స్ వద్ద కృష్ణాపురం, భీమవరం, మధుపాడ, విశ్వనాధపురం, ఖండిపల్లి, ముషిడిపల్లి, తాటిపూడి కాలనీల రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు సోమవారం ధర్నా నిర్వహించారు. రైతులు మాట్లాడుతూ నాడు విశాఖకు నీరు తీసుకెళ్లేటప్పుడు పైప్ నిర్వహణకు రోడ్డు అవసరమని భూసేకరణ చేసి పొలాల మీదుగా రోడ్డు వేశారని, తర్వాత నిర్వహణ బాధ్యతను జీవీఎంసీ పూర్తిగా గాలికొదిలేసిందని వాపోయారు. తాటిపూడి కాలనీ నుంచి కృష్ణాపురం వరకూ 5కిలోమీటర్ల మేర రోడ్డు పూర్తిగా గోతులు తేలి అధ్వానంగా తయారైందన్నారు. ఎన్ని దఫాలు జీవీఎం అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తూరు నుంచి తాటిపూడి కాలనీ వరకు రోడ్డును తక్షణం మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం విశాఖలో జీవీఎంసీ ఎదుట ధర్నా చేసేందుకు ఆటోల్లో, బైక్‌లపై తరలి వెళ్లారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు, సహాయ కార్యదర్శి మద్దిల రమణ, తాటిపూడి ఆయకట్టు రైతు సంఘం కన్వీనర్ రాయవరపు సత్యనారాయణ, కో–కన్వీనర్ లోకవరపు ఆదినారాయణ, సర్పంచ్ శ్రీరామ్మూర్తి, రైతులు వై.జోగినాయుడు, కరణం సూరిఅప్పడు, వర్రి సత్యారావు, సూరిదేముడు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దే మెరుగైన వైద్యం



దత్తిరాజేరు: గొబ్యాంలో అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ ఆనంద్‌కుమార్



గజపతినగరం: తుమ్మికాపల్లిలో వైద్యసేవలందిస్తున్న డాక్టర్ అనూజ్‌రాయ్

దత్తిరాజేరు/గజపతినగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రజలకు ఇంటివద్దనే మెరుగైన వైద్య సేవలందుతున్నాయని దత్తిరాజేరు, మరుపల్లి పీహెచ్‌సీల వైద్యాధికారులు ఆనంద్‌కుమార్, అనూజ్‌రాయ్ అన్నారు. దత్తిరాజేరు మండలంలోని గొబ్యాం, గజపతినగరం మండలంలోని తుమ్మికాపల్లిలో సోమవారం వేర్వేరుగా 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. గొబ్యాంలో నిర్వహించిన శిబిరంలో 74 మందికి, తుమ్మికాపల్లిలో 86 మందికి వైద్యసిబ్బంది వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం గృహసందర్శన చేసి దీర్ఘకాలిక వ్యాధులతో మంచంపై ఉన్న రోగులకు వైద్య తనిఖీలు చేశారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి పిల్లలకు వైద్యపరీక్షలు చేసిఆరోగ్య సూత్రాలను వివరించారు.

దోమల నివారణకు చర్యలు



దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్న నాయకులు

చీపురుపల్లి రూరల్: చీపురుపల్లి పట్టణంలోని జి.అగ్రహారంలో దోమల నివారణ మందును పంచాయతీ సిబ్బంది సోమవారం పిచికారీ చేశారు. నీటి నిల్వ ప్రాంతాల్లో, మురుగు కాలువల్లో, బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు పేరుకుపోయిన ప్రాంతాల్లో బ్లాక్ ఫినాయిల్, బ్లీచింగ్ కలిపి పిచికారి చేశారు. సర్పంచ్ మంగళగిరి సుధరాణి, వైఎస్సార్‌సీపీ నాయకుడు బెల్లాన వంశీకృష్ణ, సచివాలయ సిబ్బంది పర్యవేక్షించారు.